క్లుప్తంగా

ఉచిత బస్ పాసుల పంపిణీ

యాచారం: దివ్యాంగులకు అండగా ఉంటానని ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఈదులకంటి లక్ష్మీపతిగౌడ్ అన్నారు. శుక్రవారం నల్లవెల్లి గ్రామంలోని 50 మందికి పైగా దివ్యాంగులకు ఆయన సొంత నిధులు వెచ్చించి ఉచితంగా ఆర్టీసీ బస్ పాసులు అందజేసి మాట్లాడారు. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సహకారంతో దివ్యాంగులకు ఇందిరమ్మ ఇళ్లు, అర్హులైన వారికి ఫించన్లు, ఈజీఎస్ పనుల్లో ప్రాధాన్యత కల్పిస్తానని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు హరికిషన్, రమేష్, వంశీ, శ్రావణ్, అంజయ్య, జంగయ్య, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

ఆమనగల్లు: కాంగ్రెస్ పార్టీ తలకొండపల్లి మండల అధ్యక్షుడు డోకూరు ప్రభాకర్‌రెడ్డి సోదరుడు నరేందర్‌రెడ్డి మృతిచెందాడు. విషయం తెలుసుకున్న కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి.. శుక్రవారం పడకల్ గ్రామంలో బాధిత కుటుంబీకులను పరామర్శించారు. అంతకుముందు నరేందర్‌రెడ్డి మృతదేహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, పీసీసీ కిసాన్ సెల్ కార్యదర్శి మోహన్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ కేశవరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు అంజయ్య, అజీం పాల్గొన్నారు.

ఆర్థికవేత్తను కోల్పోయాం


శ్రీనివాస్‌రెడ్డి

ఆమనగల్లు: మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతితో దేశం గొప్ప మానవతావాది, ఆర్థికవేత్తను కోల్పోయిందని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. రిజర్వ్ బ్యాంకు గవర్నర్‌గా, ఆర్థిక మంత్రిగా, ప్రధానిగా దేశానికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. ఆర్థిక సంస్కరణలు తెచ్చి తనదైన ముద్ర వేశారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మన్మోహన్ మృతికి ఆయన సంతాపం తెలిపారు.

ఒడిబియ్యం సేకరణకు వేలం


వేలం నిర్వహిస్తున్న ఆలయ అధికారులు

కడ్తాల్: మైసిగండి మైసమ్మ, శివ రామాలయాల్లో ఏడాది పాటు కొబ్బరిచిప్పలు, ఒడిబియ్యం, చీరల సేకరణ హక్కులకు శుక్రవారం బహిరంగ వేలం పాట నిర్వహించగా.. నలుగురు వ్యక్తులు పాల్గొన్నారు. ఇందులో మైసిగండి గ్రామానికి చెందిన కేతావత్ పరంసింగ్ రూ.11,40,200 (పదకొండు లక్షల నలభై వేల రెండు వందలు)లకు దక్కించుకున్నాడు. దేవాదాయ శాఖ తూర్పు విభాగం ఇన్‌స్పెక్టర్ ప్రణీత్‌కుమార్, ఫౌండర్ ట్రస్టీ శిరోలీ, ఈఓ స్నేహలత, ఆలయ నిర్వాహకులు భాస్కర్‌నాయక్, అర్చక సిబ్బంది యాదగిరి, కృష్ణ, చంద్రయ్య, రాములు, శ్రీనివాసులు, శ్రవణ్‌కుమార్, హర్షవర్ధన్, వెంకటేశ్, బాలబ్రహ్మాచారి తదితరులు ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత


లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న నాయకులు

కందుకూరు: సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మండల పరిధిలోని ఆకులమైలారంకు చెందిన వాస వెంకటమ్మకు రూ.38 వేలు, బంగారు గాందెమ్మకు రూ.36 వేలు మంజూరయ్యాయి. ఈ మేరకు శుక్రవారం కాంగ్రెస్ నాయకులు లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు అంబేడ్కర్ సురేందర్, మాజీ ఉప సర్పంచ్ ఎడ్ల రాంరెడ్డి మాట్లాడుతూ.. మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్ చొరవతో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు మంజూరయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు జంగయ్య, బాబు, శ్రీశైలం, వెంకట్రామ్‌రెడ్డి, శ్రీకాంత్, సురేష్, పాండు, సత్యం, రాజు, రమేష్, పవన్, ప్రవీణ్ పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదానం

షాద్‌నగర్ రూరల్: ప్రాణాపాయ స్థితిలో ఉన్న వ్యక్తి ఆపరేషన్ కోసం అవసరమైన రక్తాన్ని దానం చేసిన నవీన్‌చారి ఆదర్శంగా నిలిచారు. వివరాలిలా ఉన్నాయి. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కంసాన్‌పల్లి గ్రామానికి చెందిన రామయ్య గుండె సంబంధిత వ్యాధితో హైద్రాబాద్‌లోని డీఆర్‌డీఏ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. శస్త్ర చికిత్సకు రక్తం అవసరం కావడంతో రామయ్య కుటుంబ సభ్యులు శుక్రవారం యువ సత్తాయూత్ అధ్యక్షుడు లక్ష్మణ్‌కుమార్‌ను సంప్రదించారు. దీంతో ఆయన నవీన్‌చారితో కలిసి డీఆర్‌డీఏ ఆస్పత్రికి రక్తాన్ని దానం చేయించారు. ప్రతిఒక్కరూ సామాజిక స్పృహను అలవర్చుకొని రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని దాత నవీన్‌చారి సూచించారు.

మల్టీ పర్పస్ విధానం వద్దేవద్దు

- కార్మికులను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలి
- పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి
- ఉద్యోగ, కార్మిక సంఘాల నేతల డిమాండ్
- మండల కేంద్రాల్లో కార్మికుల టోకెన్ సమ్మె


కడ్తాల్: ధర్నాలో మాట్లాడుతున్న యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పాండు

కడ్తాల్: మల్టీ పర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలని తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గ్యార పాండు డిమాండ్ చేశారు. జీపీ ఉద్యోగ, కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్త పిలుపు మేరకు శుక్రవారం మండల కేంద్రంలో టోకెన్ సమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగా పాండు మాట్లాడుతూ.. సకాలంలో జీతాలు రాక ఉద్యోగులు, కార్మికులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. 6 నుంచి 10 నెలలుగా వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని, ఇదే విషయాన్ని ప్రభుత్వానికి విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. జీఓ నంబర్ 51ని సవరించి, జీఓ 60 ప్రకారం కనీస వేతనాలు అమలు చేయడంతో పాటు కారోబార్లు, బిల్‌కలెక్టర్లకు ప్రత్యేక స్టేటస్ కల్పించాలని కోరారు. ఉద్యోగ భద్రత కల్పించి, పర్మినెంట్ చేయాలన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ, బీమా సౌకర్యం రూ.10 లక్షలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.5లక్షలు చెల్లించాలన్నారు. లేని పక్షంలో జనవరి మొదటి వారంలో నిరవధిక సమ్మె చేపడతామని హెచ్చరించారు. అంతకు ముందు మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతికి సంతాపం తెలిపారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో సీఐటీయూ ఏరియా కమిటీ కన్వీనర్ పెంటయ్య, జీపీ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు కుమార్, నాయకులు చెన్నయ్య, మహేశ్, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయండి..


నిరసన వ్యక్తంచేస్తున్న కార్మికులు

ఇబ్రహీంపట్నం: ఎన్నికలకు ముందు గ్రామ పంచాయతీ ఉద్యోగులు, కార్మికులకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ బుగ్గరాములు డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్త జీపీ కార్మికుల పిలుపు మేరకు ఇబ్రహీంపట్నం తహసీల్దార్ కార్యాలయం ఎదుట టోకెన్ సమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీపీ సిబ్బందిని పర్మినెంట్ చేసి, కనీస వేతనం రూ.19 వేలు చెల్లించాలని కోరారు. కారోబార్, బిల్ కలెక్టర్లకు సహాయ కార్యదర్శులను నియమించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వమే కార్మికుల వేతనాలకు ప్రత్యేక గ్రాంట్‌ను కేటాయించాలని, పీఆర్సీలో అర్హులుగా గుర్తించాలని పేర్కొన్నారు. విధి నిర్వహణలో మరణించిన వారికి రూ.పది లక్షల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కారోబార్లు దేవదాసు, ఐలయ్య, మల్లేశ్, సిబ్బంది నరేష్, బాలరాజ్, కిషన్, అశోక్, అనిత, రాణి, పార్వతమ్మ పద్మలు పాల్గొన్నారు.

పాలకేంద్రం సమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి


పాలనాణ్యతను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

కడ్తాల్: పాలశీతలీకరణ కేంద్రం సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని మిల్క్ సెంటర్‌ను స్థానిక నాయకులతో కలిసి సందర్శించారు. పరిసరాలు, యంత్రాలు, పాల నాణ్యతను పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతు సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు. రైతులను అన్ని విధాలుగా ఆదుకునేందుకు కృషి చేస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు.. అక్కడి సమస్యలను ఆయన దృష్టికి తేగా.. పై విధంగా స్పందించారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీక్యానాయక్, గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మానాయక్ తదితరులు ఉన్నారు.

మాజీ ఎంపీని పరామర్శించిన ఎమ్మెల్యే

ఆమనగల్లు: ఆరోగ్య సమస్యలతో నగరంలోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నాగర్‌కర్నూల్ మాజీ ఎంపీ మంద జగన్నాథంను శుక్రవారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పరామర్శించారు. వైద్యులు, కుటుంబ సభ్యులతో మాట్లాడి ఆయన ఆరోగ్య వివరాలను తెలుసుకున్నారు.

సమష్టి కృషితోనే పార్టీకి విజయం


మాట్లాడుతున్న కృష్ణారెడ్డి

కొందుర్గు: పార్టీ పటిష్టత కోసం నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పని చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు అందరూ సహకరించాలని కోరారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో ఐకమత్యంతో పనిచేసి విజయం సాధించాలన్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. సోషల్ మీడియాలో పోస్టింగ్ చేసే సమయంలో ఎమ్మెల్యే, మండల నాయకుల ఫొటోలు పెట్టకపోవడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. అనంతరం సోషల్ మీడియా మండల కమిటీ అధ్యక్షుడిగా దుర్గని శ్రీనును ఎన్నుకున్నారు. సమావేశంలో నాయకులు యాదయ్య, రామయ్యగౌడ్, నరేందర్, కృష్ణయ్య పాల్గొన్నారు.

ప్రత్యేక కార్యక్రమాలకు అనుమతి తప్పనిసరి

బాలాపూర్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్


హోటల్‌ను తనిఖీ చేస్తున్న పోలీసులు

పహాడీషరీఫ్: నూతన సంవత్సర వేడుకల పేరుతో అనుమతి లేకుండా ప్రత్యేక కార్యక్రమాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఇన్‌స్పెక్టర్ ఎం.సుధాకర్ హెచ్చరించారు. శుక్రవారం సిబ్బందితో కలిసి హోటళ్లు, లాడ్జీలను తనిఖీ చేశారు. నిర్వాహకులకు తగిన సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. డిసెంబర్ 31 రాత్రి స్టేషన్ పరిధిలో ప్రత్యేక నిఘా ఉంచామని తెలిపారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. యువత కొత్త ఏడాది పేరుతో మద్యం పార్టీలు, మ్యూజిక్ ఈవెంట్లంటూ.. అర్ధరాత్రి వరకు రోడ్లపై తిరుగి ప్రమాదాలను కొని తెచ్చుకోరాదని సూచించారు. నూతన సంవత్సరం అంటే కేలండర్ మారడం మాత్రమేనని గుర్తుంచుకోవాలని పేర్కొన్నారు. ఉగాది పండుగ తెలుగు నామ నూతన సంవత్సరమని, పాశ్చాత్య పోకడలకు దూరంగా ఉంటూ సంస్కృతి, సంప్రదాయాలను గౌరవించుకోవాలని చెప్పారు. తనిఖీల్లో ఎస్ఐలు యూసుఫ్ జానీ, శ్రీనివాస్, శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు.

అంబులెన్స్‌లో ప్రసవం


కుటుంబ సభ్యులకు శిశువును అందిస్తున్న 108 సిబ్బంది

కేశంపేట: అంబులెన్స్‌లో ఓ గర్భిణి పండంటి పాపకు జన్మనిచ్చిన సంఘటన మండల పరిధిలోని వేములనర్వ గ్రామ శివారులోని శుక్రవారం చోటుచేసుకుంది. బోధునంపల్లి గ్రామానికి చెందిన రమ్య పురిటి నొప్పులతో బాధపడుతుండగా కుటుంబ సభ్యులు 108కు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న అంబులెన్స్ సిబ్బంది ఆమెను కేశంపేట పీహెచ్‌సీకి తరలించారు. అక్కడ సిబ్బంది గర్భిణిని షాద్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించాలని సూచించారు. అదే అంబులెన్స్‌లో తరలిస్తుండగా వేములనర్వ గ్రామ శివారులోని నంబయ్యగుట్టకు రాగానే పురిటి నొప్పులు అధికమయ్యాయి. వెంటనే అంబులెన్స్‌ను ఆపి కుటుంబ సభ్యుల సహకారంతో ఈఎంటీ సాయికృష్ణ, పైలెట్ దీపక్ సుఖ ప్రసవం చేశారు. రమ్య పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. పాపను కుటుంబ సభ్యులకు అప్పగించిన అనంతరం తల్లీబిడ్డలను షాద్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

హోదా ఇచ్చారు.. భవనాలు మరిచారు

- నూతన పంచాయతీలను వేధిస్తున్న మౌలిక వసతుల కొరత
- అద్దె, కమ్యూనిటీ, పాఠశాల భవనాల్లోనే పాలన కొనసాగింపు
- ఇబ్బందులు పడుతున్న సిబ్బంది, గ్రామస్తులు



నాగర్‌గూడ పాఠశాలలో కొనసాగుతున్న పంచాయతీ కార్యాలయం

షాబాద్: పరిపాలన సౌలభ్యం దృష్ట్యా గతంలో ప్రభుత్వం నూతన గ్రామ పంచాయతీలను అవసరమున్న చోట్ల ఏర్పాటు చేసింది. కానీ వాటికి శాశ్వత భవనాలు నిర్మించడంలో అలసత్వం ప్రదర్శిస్తోంది. ఫలితంగా గ్రామ పాలన వ్యవహారమంతా అద్దె భవనాలు, ప్రభుత్వ పాఠశాలల్లోనే కొనసాగుతుంది. ఈ అంశాలపై గతంలోనే ప్రభుత్వ అధికారులకు విన్నవించినా పట్టించుకున్న పాపాన పోలేదని గ్రామస్తులు వాపోతున్నారు. సరైన సదుపాయాలు లేక సిబ్బంది, కార్యాలయ పనుల నిమిత్తం వచ్చే వారు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుత ప్రభుత్వమైనా దృష్టి సారించాలని కోరుతున్నారు.

అనేకసార్లు వినతులు

షాబాద్ మండలంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పలు గ్రామాలకు పంచాయతీ హోదా కల్పించారు. అయితే ఈ గ్రామాల్లో పంచాయతీ భవనాలు నిర్మించకపోవడంతో ప్రభుత్వ పాఠశాల, ఇతర భవనాల్లో పాలన సాగిస్తున్నారు. మండలంలోని నాగర్‌గూడ, లక్ష్మారావుగూడ, పోలారం, గొల్లూరుగూడ, తాళ్లపల్లి, అప్పారెడ్డిగూడ, చర్లగూడ, కేశవగూడ గ్రామాల్లో పంచాయతీ భవనాల నిర్మాణం జరగలేదు. గ్రామ పంచాయతీలను పాఠశాల భవనాలు, కమ్యూనిటీ భవనాల్లో కొనసాగిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను సైతం అద్దె భవనాల్లో నిర్వహించాల్సిన దుస్థితి ఏర్పడింది. గ్రామాల్లో పంచాయతీ భవనాలతో పాటు మౌలిక వసతులను కల్పించాలని గత ప్రభుత్వ హయాంలో ప్రజలు ఉన్నతాధికారులకు విన్నవించుకున్నా ఫలితం కనిపించలేదు. ప్రస్తుతం జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే కాలె యాదయ్యతో పాటు మండల అధికారులకు గ్రామ పంచాయతీ భవనం, రోడ్లు, అంగన్‌వాడీ కేంద్రం భవనాలను నిర్మించాలని వివిధ గ్రామాల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.


నాలుగేళ్లుగా విన్నవిస్తున్నాం



మండలంలోని నాగర్‌గూడలో రోడ్లు, గ్రామ పంచాయతీ భవనం నిర్మించాలని నాలుగు సంవత్సరాలుగా జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులను కలిసి వినతిపత్రాలు అందిస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. గ్రామ అభివృద్ధికి చొరవ చూపకపోవడంతో స్థానికులు తీవ్రంగా నష్టపోతున్నారు.

– నర్సింహులుగౌడ్, మాజీ సర్పంచ్, షాబాద్

నిధులు ఇవ్వలేదు



సర్వసభ్య సమావేశాల్లో గ్రామాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరినప్పటికీ ఆసక్తి చూపలేదు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు అందలేదు. కేవలం నాయకులు గ్రామాల అభివృద్ధి గురించి మాట్లాడటం తప్ప చేసిందేమీ లేదు. ప్రస్తుత ప్రభుత్వం వీటిపై దృష్టి సారించాలి.

– శ్రీరాంరెడ్డి, తిర్మలాపురం, షాబాద్


కాంక్రీటు వేయిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

రోడ్డుపై గుంతల పూడ్చివేత

చేవెళ్ల: మండలం కేంద్రంలోని బస్టాండ్ వద్ద రోడ్డు పక్కన ఉన్న మట్టి వర్షానికి కొట్టుకుపోవడంతో గుంతలు ఏర్పడ్డాయి. రాకపోకలు సాగించే వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు తలెత్తున్నాయి. దీంతో చేవెళ్ల ట్రాఫిక్ సీఐ వెంకటేశ్వర్లు స్పందించి.. శుక్రవారం గుంతల్లో కాంక్రీటు వేయించి, గుంతలను పూడ్చి వేయించారు. దీనిపై వాహనదారులు హర్షం వ్యక్తం చేశారు.

గుర్రంపల్లిలో పోచమ్మ బోనాలు

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండలం గుర్రంపల్లిలో శుక్రవారం పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి సమర్పించారు. మాజీ ఎంపీపీ సన్వల్లి యాదమ్మ అమ్మవారికి పట్టు చీర సమర్పించారు.

స్థానిక పోరుకు సిద్ధంగా ఉండాలి

బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి శ్రీధర్‌రెడ్డి


నియామకపత్రం అందజేస్తున్న శ్రీధర్‌రెడ్డి, రాము

షాబాద్: స్థానిక సంస్థల ఎన్నికలకు బీజేపీ నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి శ్రీధర్‌రెడ్డి, బీజేవైఎం స్వచ్ఛ భారత్ సెల్ రాష్ట్ర కన్వీనర్ రాము పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని చర్లగూడ 234 బూత్ అధ్యక్షుడిగా రాఘవేందర్, రుద్రారం 204 బూత్ అధ్యక్షుడిగా ముత్యంరెడ్డిలను ఏకగ్రీవంగా ఎనుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీజేపీకి యువతే కీలకమని, యువతీ యువకులంతా ఏకమై పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. వచ్చే ఎన్నికల్లో నియోజకవర్గంలో బీజేపీ జెండాను రెపరెపలాడించేలా సమష్టిగా పని చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు శివకుమార్, సాయికుమార్, శ్రీనివాస్‌రెడ్డి, సందీప్, శ్రీనివాస్, అరుణ్, వెంకటయ్య, ఉపేందర్‌రెడ్డి, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


ఇబ్రహీంపట్నంలో..


ఆమనగల్లులో..


మంచాల: జాపాలలో..

ఆర్థిక దార్శనికుడు.. మన్మోహన్

'మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మరణం దేశానికి తీరని లోటు. ఆర్థిక వేత్తగా, రిజర్వ్ బ్యాంక్ గవర్నర్‌గా, ఆర్థిక శాఖ మంత్రిగా, ప్రధానిగా దేశానికి ఆయన ఎన్నో సేవలు చేశారు. అనేక ఆర్థిక సంస్కరణలను ప్రవేశపెట్టిన మహనీయుడు' అని వక్తలు అన్నారు. వయోసంబంధిత సమస్యలతో మన్మోహన్.. గురువారం కన్నుమూశారు. ఈ సందర్భంగా ఆర్థిక సంక్కరణల సారథి మృతికి సంతాపం తెలుపుతూ శుక్రవారం ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తదితరులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మన్మోహన్ సేవలను కొనియాడారు.

– సాక్షి, నెట్‌వర్క్


కడ్తాల్: మన్మోహన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తదితరులు


యాచారంలో..


ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల మున్సిపాలిటీ బొంగ్లూర్‌లో..

కార్మికులకు అండగా ఉంటాం

ఎంపీ రఘునందన్‌రావు


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎంపీ రఘునందన్ రావు

నందిగామ: కార్మికుల సంక్షేమానికి ఎల్లవేళలా అండగా ఉంటామని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. మండల పరిధిలోని మేకగూడ నాట్కో మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి రమేష్ ఆధ్వర్యంలో నూతన క్యాలెండర్‌ను శుక్రవారం హైదరాబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో ఎంపీ రఘునందన్‌రావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. కార్మికులు ఐకమత్యంతో ఉండి తమ హక్కులను సాధించుకోవాలని, వారి సంక్షేమం కోసం ఎల్లప్పుడు వారికి అందుబాటులో ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ గౌరవ అధ్యక్షుడు శ్రీవర్ధన్ రెడ్డి, యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేశ్వర్‌రావు, నాయకులు శ్రీనివాస్, శ్రీను, నర్సింహ, పాండు, విష్ణు, యాదిరెడ్డి, రాంసింగ్, బాబు, రాందాస్, శేఖర్, శివనారాయణ, కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, రామకృష్ణ, సత్తయ్య, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

పేదల పక్షాన పోరాటం

కొందుర్గు: వందేళ్ల ఉత్సవాల్లో భాగంగా నల్లగొండ పట్టణంలో ఈ నెల 30న నిర్వహించే సీపీఐ భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు బుద్దుల జంగయ్య కోరారు. ఈ మేరకు కొందుర్గులో శుక్రవారం వాల్ పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వందేళ్ల క్రితం పేదల కోసం ఆవిర్భవించిన పార్టీ భారత కమ్యూనిస్టు అని, నాటి నుంచి నేటి వరకు పేదల పక్షాన పోరాటం చేస్తూనే ఉందన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు నర్సింహ, రమేష్, బందెమ్మ, యామిని, సువర్ణ, రాములమ్మ, యాదమ్మ, రాములు, యాదయ్య పాల్గొన్నారు.